క్లుప్తంగా

వేసవి సెలవులు వృథా చేసుకోవద్దు

జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ వల్లభనేని



తిరువూరు: విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేసుకోవద్దని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ వల్లభనేని రవీంద్ర సూచించారు. సోమవారం స్థానిక సుందరయ్య భవన్లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. విద్యార్థి దశలో తెలియని విషయాన్ని తెలుసుకోడానికి ఆసక్తి కలిగిన బాలబాలికలకు జనవిజ్ఞాన వేదిక ఈ తరగతులను నిర్వహిస్తోందని, విజ్ఞానం పెంపొందించడంతో పాటు విలువైన సమయాన్ని ఆదా చేసుకోవాలని రవీంద్ర సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల అభిరుచులకు అనుగుణంగా శిక్షణ ఇప్పించాలన్నారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, స్థానిక ప్రతినిధులు ఎం.హరికృష్ణ, రాంప్రదీప్, పాపారావు, సుదర్శన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలలకు పోలీసుల ఆశ్రయం



తిరువూరు: మండలంలోని ఎర్రమాడు పొలాల్లో దిక్కుతోచక సంచరిస్తున్న ముగ్గురు బాలలను గ్రామస్తులు సోమవారం తిరువూరు పోలీసులకు అప్పగించారు. తమ పేర్లు నాంచారమ్మ, చెంచయ్య, వెంకటేశ్వరమ్మ అని చెబుతున్న వీరు తమది తాడేపల్లి గ్రామమని, తమ తల్లిదండ్రులు పాతకాగితాలు, చెత్త సామానులు ఏరుకుని జీవనం సాగిస్తారని చెబుతున్నారు. ముగ్గురినీ తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ విచారించి వారి తల్లిదండ్రుల ఆచూకీకై ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

గొడుగుల పంపిణీ



విస్సన్నపేట: సత్యసాయిబాబా శత జయంతి సందర్భంగా మండలంలో సోమవారం గొడుగులు పంపిణీ చేశారు. స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మండలంలోని నరసాపురం, ముతరాశిపాలెం గ్రామాల్లో గొడుగులు, చీరెలు, పాదరక్షలు పంపిణీ చేశారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ జగ్గవరపు రంగారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు



ఆగిరిపల్లి: మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవని ఎస్ఐ శుభశేఖర్ హెచ్చరించారు. సోమవారం సాయంత్రం ఆగిరిపల్లిలోని పలు ప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేశారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారి తండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోసారి మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. హెల్మెట్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడిపినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్ ఫిలిం ఫెస్టివల్లో విజేతలకు బహుమతులు



ఆగిరిపల్లి: మండలంలోని తాడేపల్లి చొప్పరమెట్ల హ్యాపీ వ్యాలీ పాఠశాలలో షార్ట్ ఫిలిం ఫెస్టివల్ నిర్వహించారు. కేకేఆర్ విద్యాసంస్థలు, 64 కలలు డాట్ కామ్ ఆధ్వర్యంలో సోమవారం తాడేపల్లి చొప్పరమెట్లలోని కేకేఆర్ హ్యాపీ వ్యాలీ పాఠశాలలో వందకు పైగా లఘు చిత్రాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో 'థాంక్ గాడ్' అనే లఘు చిత్రం ప్రథమ స్థానం దక్కించుకోవడంతో రూ.లక్ష బహుమతి అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన 'నేస్తం' చిత్రానికి రూ.50 వేలు, 'ఉపవాసం' లఘు చిత్రం తృతీయ స్థానం రాగా రూ.30 వేలను కేకేఆర్ విద్యాసంస్థల అధినేత కొసరాజు కోటేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో 64 కలల డాట్ కామ్ అధినేత కళాసాగర్, వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. అంతే!





నూజివీడు మండలం దేవరగుంట వద్ద రామిలేరుపై రెయిలింగ్స్ లేని లోలెవెల్ కాజ్‌వే : వరదలకు దెబ్బతిన్న దంతులవారిగూడెం- మర్రికుంట చప్టా

ప్రమాదభరితంగా లో లెవల్ కాజ్‌వేలు, వంతెనలు

నూజివీడు: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పలు గ్రామాల పరిధిలో వాగులపై ఉన్న లో లెవెల్ కాజ్‌వే, చప్టా, కల్వర్టులు దెబ్బతిని ప్రమాదభరితంగా మారాయి. గత వర్షాకాలంలో వచ్చిన వరదలకు వాగులు పొంగడంతో వాటికి సమీపంలో రోడ్లు కూడా దెబ్బతిన్నాయి. వరదలకు దెబ్బతిన్న కల్వర్టులు, కాజ్‌వేల వద్ద మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉంది. వీటికి ప్రధానంగా రెయిలింగ్స్ లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోననే ఆందోళన వాహనదారుల్లో వ్యక్తమవుతోంది.

- నూజివీడు మండలంలో రామిలేరు, ఊటవాగులు ప్రవహిస్తున్నందున వానాకాలంలోను, తుపాన్ల సమయంలోనూ వీటికి వరద నీరు పెద్ద ఎత్తున వస్తుంది. దీంతో ఈ వాగులు ఉధృతంగా ప్రవహించి రోడ్లపైకి వరదనీరు చేరి రాకపోకలు స్తంభించిపోతాయి. రామిలేరుపై ఉన్న కల్వర్టులు, కాజ్‌వేలకు మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉంది.
- పోతురెడ్డిపల్లి రోడ్డులో నూజివీడు పట్టణ పరిధిలోని ఊటవాగుపై ఉన్న కాజ్‌వేకు గతంలోనే భారీ రంధ్రం పడగా తాత్కాలికంగా పూడ్చారు. శాశ్వత మరమ్మతులు చేయాలి.
- జంగంగూడెం, తుక్కులూరు, దేవరగుంట, మీర్జాపురం – కాట్రేనిపాడు మార్గంలో ఉన్న లో లెవెల్ కాజ్‌వేలు సైతం దెబ్బతినడమే కాకుండా రెయిలింగ్స్ లేవు.
- పోతురెడ్డిపల్లి, సింహాద్రిపురం మధ్య, ఆగిరిపల్లి మండలం చిన్నాగిరిపల్లి, తోటపల్లిల మధ్య, విస్సన్నపేట మండలం నర్సాపురం, చాట్రాయిల మధ్య, చాట్రాయి మండలం చిత్తపూర్, జనార్ధనవరం మధ్య కాజ్‌వేలు, వంతెనలు దెబ్బతిన్నాయి. వీటికి రెయిలింగ్స్ లేకపోవడం వల్ల వరదల సమయంలో వాహనాలు వాగులోకి కొట్టుకుపోతున్నాయి. వరదలో కొట్టుకుపోయే వారికి రెయిలింగ్స్ ఆదరవుగా ఉంటాయి. వాటిని పట్టుకొని ప్రాణాలను కాపాడుకునే అవకాశం ఉంటుంది.
- నూజివీడు మండలంలోని దంతులవారిగూడెం – మర్రికుంట గ్రామాల మధ్య ఊటవాగుపై చప్టా ఉండగా గత ఏడాది వచ్చిన వరదలకు చప్టా అంతా కొట్టుకుపోయి రోడ్డు గోతులమయంగా తయారైంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి రెండు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వంతెనలు, కాజ్‌వేలకు మరమ్మతులు చేయాలి..



ప్రమాదభరితంగా ఉన్న వంతెనలకు, కాజ్‌వేలకు వెంటనే మరమ్మతులు చేయాలి. రెయిలింగ్స్‌ను నిర్మించినట్లయితే వరదలు వచ్చేటప్పుడు వాహనాలు వాగులోకి కొట్టుకుపోకుండా అడ్డుకుంటాయి. వర్షాకాలం వచ్చేలోగా మరమ్మతులు పూర్తిచేయాలి.

– పాలడుగు విజయ్‌కుమార్, తుక్కులూరు, నూజివీడు మండలం

- ఆగిరిపల్లి మండలంలో నూగొండపల్లి వద్ద ప్రవహించే కుంపిణీ వాగుపై ఉన్న వంతెనకు రెయిలింగ్స్ లేక ప్రమాదభరితంగా ఉంది. ఈ వాగుకు వరద ఎక్కువగా వస్తుంది. ఈ వంతెనపై గతంలో రెండుసార్లు మనుషులు కొట్టుకుపోయిన ఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో ప్రమాదభరితంగా ఉన్న లోలెవెల్ కాజ్‌వేలను, చప్టాలను, కల్వర్టులకు మరమ్మతులు చేయించి ప్రమాదాలు సంభవించకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు ప్రారంభం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విజ్ఞాన అభివృద్ధిలో కీలకపాత్ర పోషించేది గ్రంథాలయాలే అన్నారు. వేసవిలో విద్యార్థులకు వినోదంతో పాటు విజ్ఞానం పెంచేందుకు శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి విద్యార్థి శాస్త్రీయ దృక్పథం అలవార్చుకోవాలని కోరారు. వేసవి విజ్ఞాన శిబిరాలు తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తామని గ్రంథాలయ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. విద్యార్థులకు సమీక్షలు, పుస్తక పఠనం నిర్వహించారు.

మైలవరం: యువత గ్రంథాలయాల సేవలు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు కోయ సుధ తెలిపారు. మైలవరం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ప్రారంభించారు. కోయ సుధ మాట్లాడుతూ గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు వివరిస్తూ విద్యార్థులకు కథలు చదివి వినిపించడం, వినగలిగే సామర్థ్యాన్ని పెంపొందించడం, పుస్తకాలు చదివించడం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, ఆట, పాటలు, బొమ్మలు తయారు చేయడం తదితర అంశాలను నేర్పిస్తామన్నారు. గ్రంథాలయాధికారి నాగార్జున, అహ్మద్, రిటైర్డ్ ఉపాధ్యాయులు సురేష్‌బాబు, టి.వెంకటేశ్వరరావు, రాధాకృష్ణ విశేష సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ అంశాలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

జనరల్ నాలెడ్జిపై..

ఆగిరిపల్లి: విద్యార్థులు వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక గ్రంథాలయ అధికారి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం నుంచి ఆగిరిపల్లి గ్రంథాలయంలో శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఉపాధ్యాయుడు కలపాల రాజ్‌కుమార్ విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన కల్పించారు.



కొండపల్లి గ్రంథాలయంలో పుస్తక పఠనం నిర్వహిస్తున్న కామేశ్వరరావు



గ్రంథాలయంలో శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు



విద్యార్థులతో కథల పుస్తకాలు చదవిస్తున్న గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు



తిరువూరు గ్రంథాలయంలో మాట్లాడుతున్న కమిషనర్ లోవరాజు

సెల్ ఫోన్ చూసే బదులు..

నూజివీడు: పట్టణంలోని ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో సోమవారం సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పుస్తకాలను చదివించారు. అనంతరం 11గంటల వరకు నీతి కథలు చెప్పారు. 12 గంటల వరకు పేపర్ క్రాఫ్ట్ నేర్పించారు. గ్రంథాలయాధికారి బీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒక గంట సెల్‌ఫోన్ చూసే బదులు కథల పుస్తకం చదవడం వల్ల ఎంతో మేలు కలుగుతుందన్నారు. గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞానం పెంచుకోవాలి..

ముసునూరు: స్థానిక గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులను గోపవరం సర్పంచి కంచర్ల వాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతుల్లో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తరగతుల నిర్వహణ అభినందనీయం

తిరువూరు: స్థానిక గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరాన్ని నగర పంచాయతీ కమిషనర్ బీ లోవరాజు సోమవారం ప్రారంభించారు. వేసవిలో శిక్షణ తరగతులను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎంఈవో శ్యాం సుందర్, గ్రంథాలయాధికారిణి పద్మావతి, ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు వాణీ రంగారావు పాల్గొన్నారు. గంపలగూడెం మండలం పెనుగొలను శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవో నరసింహారావు ప్రారంభించారు. గ్రంథాలయాధికారి శ్రీలత, స్థానికులు పాల్గొన్నారు.

మే ఒకటి నుంచి ఉచిత యోగా శిక్షణ

ఇబ్రహీంపట్నం: శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఏకాలనీలో మే ఒకటి నుంచి 21వ తేదీ వరకు ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు లంకే జనార్ధన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం నాలుగు బ్యాచ్‌లుగా శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణలో ప్రాణాయామం, సూక్ష్మ వ్యాయామాలు, సూర్యనమస్కారాలు, యోగాసనాలు, ముద్రలపై శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. వివరాలకు 63014 54859 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

టీడీపీలో మరోసారి విభేదాలు బహిర్గతం

తిరువూరు: మే 2న అమరావతికి ప్రధాని రానున్న సందర్భంగా తిరువూరు నియోజకవర్గం నుంచి జన సమీకరణపై చర్చించే నిమిత్తం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సోమవారం ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీ సమావేశం వేదికగా పార్టీలో విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. నియోజకవర్గ సమన్వయ కమిటీలో 20 మందికి పైగా నాయకులు, సభ్యులు ఉండగా ఒకరిద్దరు మాత్రమే హాజరయ్యారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు సుఖవాసి శ్రీనివాసరావు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి సమక్షంలో జరిగిన సమావేశాన్ని సమన్వయ కమిటీతో సంబంధం లేని వ్యక్తులతో నిర్వహించారని సీనియర్ నాయకులు విమర్శించారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో సమావేశం జరుగుతున్న సమయంలోనే రాష్ట్ర ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్ కార్యాలయంలో ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం సమావేశమైంది. ఇప్పటికే పలుమార్లు ఎమ్మెల్యే వైఖరిపై ఫిర్యాదు చేసినా అధిష్టానం స్పందించకపోవడంతో ఆయన నాయకత్వంలో పనిచేయబోమని తేల్చిచెప్పారు. ప్రధానమంత్రి అమరావతి పర్యటనకు జన సమీకరణలో తాము స్వచ్ఛందంగా పాల్గొంటామని, ఎమ్మెల్యేపై అధిష్టానం చర్య తీసుకునేవరకు ఆయన పిలుపు ఇచ్చే కార్యక్రమాలను బహిష్కరిస్తామని సీనియర్లు బాహాటంగా చెబుతున్నారు. అధిష్టానం వద్దకు మరోసారి తిరువూరు పార్టీ సమస్య తీసుకెళ్లి ఎమ్మెల్యేపై చర్య తీసుకోవాలని కోరాలని భావిస్తున్నట్లు తెలిపారు.

పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వండి

చాట్రాయి: పేదలు సాగు చేస్తున్న భూములకు సాగు పట్టాలు ఇవ్వాలని అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట పేదలతో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. మండలంలోని చిత్తపూరు గ్రామంలో ఆర్ఎస్ 1- 4లో 125 ఎకరాల భూమిని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు చాలా కాలం నుంచి సాగు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారని చెప్పారు. ఈ భూమి ఫారెస్టు భూమి కాదని, రెవెన్యూ, ఫారెస్టు అధికారులు జాయింట్ సర్వే చేసి సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సభ్యులు చాట్ల బాబూరావు, ఏసు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పేదలు

రహదారి విస్తరణ చేపట్టాలి

విస్సన్నపేట: విస్సన్నపేట ఎన్టీఆర్ కాలనీ ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ కాలువలు నిర్మించి రోడ్డు విస్తరణ చేపట్టాలని కాలనీ వాసులు సోమవారం ఎంపీడీవో చిన రాట్నాలుకు వినతి పత్రం సమర్పించారు. కాలనీ ఏర్పడిన సమయంలో రహదారి 20 అడుగుల వెడల్పు ఉండగా, ఇప్పుడు ఆక్రమణలకు గురై వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు.

సారా విక్రేతలకు జరిమానా

చాట్రాయి: బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తులకు తహసీల్దార్ కోర్టు జరిమానా విధించినట్లు నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐ మస్తానరావు సోమవారం విలేకర్లకు తెలిపారు. మండలంలోని సిగుడిపాడు గ్రామానికి చెందిన కె.జయరాజు, పోతనపల్లి గ్రామానికి చెందిన హసావతు బాలరాజు గతంలో సారా విక్రయిస్తుండగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు చెప్పారు. మళ్లీ సారా విక్రయిస్తూ బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించడంతో తహసీల్దార్ గీత నిందితులకు రూ.10 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

నంబర్- 2 పాఠశాలను విలీనం చేయొద్దు

మైలవరం: మైలవరం ఆదాంపురంలోని నంబర్- 2 పాఠశాలను ఒకటో పాఠశాలలో విలీనం చేసే ఆలోచనను విద్యా శాఖ అధికారులు విరమించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ నాయకులు చాట్ల సుధాకర్ సోమవారం డిమాండ్ చేశారు. ఈ విధంగా విలీనం చేయడం వలన సుమారు 20 మంది విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉంటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నంబర్ -1 పాఠశాలను మోడల్ స్కూల్‌గా అభివృద్ధి చేయాలని, నంబర్-2 పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని ఆయన కోరారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించొద్దు

మీకోసంలో 13 అర్జీలు

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం)లో వచ్చిన అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించకుండా సకాలంలో పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. దీనిలో భాగంగా డివిజన్‌లోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి సబ్‌కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. మొత్తం 13అర్జీలు రాగా వాటిని సంబంధిత అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఓ వెంకటరత్నం, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరు భాస్కరరెడ్డి, హెచ్ఓ ఆర్ హేమ, ఏఓ చాముండేశ్వరి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని ..

- తన భర్త డయాలసిస్ చికిత్స చేయించుకుంటూ 2023 ఆగస్టు 14న మృతి చెందారని, ఆయనకు ప్రభుత్వం రూ.10 వేలు పింఛన్‌ను ఇచ్చేదని, ఆయన మృతి చెందిన తరువాత వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా ఇంత వరకు మంజూరవ్వలేదని, తనకు న్యాయం చేయాలని కోరుతూ నూజివీడు మండలం తుక్కులూరుకు చెందిన గత్తం శైలజ అర్జీని అందజేశారు.
- ముసునూరు మండలం కాట్రేనిపాడులోని పెద్ద చెరువుకు వెళ్లే సప్లయి చానల్ అక్కినేని రాజేంద్రప్రసాద్ తోట వద్ద పూడికతో నిండిపోయిందని, దీంతో వరదలు వచ్చినపుపడు వరదనీరంతా తమ పొలాల వైపునకు రావడంతో వరదలో మునిగిపోతున్నాయని, సప్లయ్‌చానల్‌లోని పూడికను తొలగించాలని కోరుతూ రైతులు అక్కినేని రాజేంద్రప్రసాద్, తాడిశెట్టి సాయిబాబు, వజ్జా హరీష్‌కుమార్ తదితరులు అర్జీని అందజేశారు.
- నూజివీడు మండలం మీర్జాపురంలో సర్వే నంబరు 111-5లో 40 సెంట్ల భూమి ఉందని, అయితే పాసుపుస్తకంలో 11 సెంట్లుగా మాత్రమే నమోదైందని, దీనిని సరిచేయాలని కోరుతూ నూజివీడుకు చెందిన మందపాటి వెంకటేశ్వరరావు అర్జీని అందజేశారు.
- చాట్రాయి మండలం ఆరుగొలనుపేట ఐదో వార్డులో మట్టిరోడ్డును సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేయనీయకుండా అడ్డుకుంటువారిపై చర్యలు తీసుకోవాలని అర్జీని అందజేశారు.



నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్

ఆర్టీసీ ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఉద్యోగుల భద్రతకు సంబంధించి 1/2019 జీవో అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు నెలలుగా అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న యాజమాన్యం తీరును తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ సీహెచ్ మోహనరావు మాట్లాడుతూ ఆర్టీసీలో పాత వైద్య విధానం, ఉద్యోగుల ప్రమోషన్స్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే డీపీటీవో కార్యాలయం ముట్టడిస్తామని ప్రకటించారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల రిలే దీక్షలు

తిరువూరు: ఎన్ఎంయూ(ఏ) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు తిరువూరు ఆర్టీసీ డిపోలో కార్మికులు సోమవారం రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థాపరంగా వేతనాలు చెల్లించాలని, తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీ కేటాయించాలని, పారదర్శకమైన బదిలీ విధానం అమలు చేయాలని, ఆన్ కాల్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని, అక్రమ సస్పెన్షన్లు, తొలగింపులు ఆపాలని, గత నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన పదోన్నతులు వెంటనే ఇవ్వాలని కోరుతూ ఈ దీక్షలు నిర్వహిస్తున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. మంగళవారం కూడా దీక్షలు కొనసాగుతాయని తెలిపారు.



ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో వద్ద రిలే నిరాహార దీక్షలో ఎన్ఎంయూఏ నాయకులు, ఉద్యోగులు



తిరువూరు ఆర్టీసీ డిపో వద్ద ఎన్ఎంయూఏ రిలేదీక్షలు

పేదరికాన్ని దూరం చేయగల శక్తి విద్యకే..

మైలవరం: పేదరికాన్ని దూరం చేయగల శక్తి విద్యకే ఉందని ఎన్ఆర్ఐ డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి తెలిపారు. మైలవరం మండలం వెల్వడంలోని లకిరెడ్డి పాపులమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల భవన నిర్మాత డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి సోమవారం అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండి శ్రద్ధాశక్తులతో చదువుకుని బంగారు భవిష్యత్తు నిర్మించుకోవాలన్నారు. చదువు మాత్రమే పేదరికాన్ని దూరం చేయగలదని, దురలవాట్లకు బానిసలు కారాదని సూచించారు. పాఠశాల ప్రథమ స్థానం సాధించిన విద్యార్థి బి.మహేంద్రను భవిష్యత్తులో ఏమవుతావని ఆయన ప్రశ్నించగా తాను కలెక్టర్ అవుతానని చెప్పడంతో సంతోషించారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులను, విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు. ఉపాధ్యాయులు డి.జ్ఞాన సుందరి, ఎమ్.తిరుపతిరావు, డి.శ్రీనివాసరావు, బి.బాలాజీ, ఎం.హమీదున్నీసా భేగం, జే కోటేశ్వరమ్మ, ఎస్. అఖిల, పి.దినేష్, వి.అలేఖ్య, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణపై శిక్షణ

తిరువూరురూరల్: ఖరీఫ్ సీజన్లో పంటల సాగుకు ముందుగా భూసార పరీక్షలు చేయడంలో కీలకమైన మట్టి నమూనాల సేకరణపై రైతు సేవా కేంద్రాల సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని తిరువూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కెనడీ సూచించారు. సోమవారం మండలంలోని లక్ష్మీపురంలో మట్టినమూనాల సేకరణపై ఆర్ఎస్‌కే సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మట్టినమూనా తీసేటపుడు పొలం గట్లకు దగ్గరగా, ఎరువులు కలిపిన చోట, చెట్ల కింద, నేల తడిగా ఉన్న ప్రదేశాల్లో నమూనా సేకరించవద్దని తెలిపారు. సేకరించిన మట్టిని గడ్డలు లేకుండా మెత్తగా దంచి పట్టాపై పరిచి అరకిలో మట్టి వచ్చేవరకు క్వార్టర్లింగ్ పద్ధతిలో మట్టి నమూనా తయారు చేయాలని సూచించారు. మండలంలో 1,210 మట్టి నమూనాలను సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించినందున ఆర్ఎస్‌కే సిబ్బంది తగు చొరవ చూపాలన్నారు. మట్టినమూనాలు తీయించదలచిన రైతులు రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని మండల వ్యవసాయాధికారి పద్మ కోరారు.



లక్ష్మీపురంలో మట్టినమూనాల సేకరణపై శిక్షణ ఇస్తున్న ఏడీఏ కెనడీ

పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలి

నూజివీడు: రెవెన్యూ, పోలీస్ డివిజన్ కేంద్రంగా నిత్యం రద్దీగా ఉండే నూజివీడు పట్టణంలో పబ్లిక్ టాయిలెట్స్ లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని, వెంటనే పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలని కోరుతూ బీజేపీ పట్టణ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి నేతృత్వంలో సోమవారం సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సమస్య తీవ్రతను గమనించి బహిరంగ మరుగుదొడ్లు నిర్మించాలని, సంచార మూత్ర శాలలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి దోసపాటి మల్లిఖార్జున జగదీష్, కార్యదర్శి సూర్య ప్రకాష్ కుమార్, మహిళా మోర్చా నాయకురాలు పద్మిని పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

నూజివీడు: వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని పెద్దగాంధీబొమ్మ సెంటర్‌లో సోమవారం మజ్జిగను పంపిణీ చేశారు. మాటూరి సతీష్, శ్రీదేవి దంపతుల సౌజన్యంతో మజ్జిగ పంపిణీ చేశారు. వాసవీక్లబ్ జిల్లా నాయకులు చిన్నం శ్రీనివాసరావు, వాసవీ యువతరంగ్ మాజీ అధ్యక్షుడు కందుల వినోద్ పాల్గొన్నారు.